

నేడే ముగ్గుల పోటీలు

సిద్ధమైన వేదికలు

● ఉదయం 10 గంటల నుంచి

తిరుపతిలో: నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం(స్విమ్స్ సర్కిల్)
చిత్తూరులో: పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాంధీబొమ్మ దగ్గర
మదనపల్లెలో: జడ్పీ హైస్కూల్ ఆవరణ, ఆర్టీసీ బస్టాండు దగ్గర

తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం తిరుపతి, చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్ట్నర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్ట్నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. తిరుపతి నగరంలో నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం(స్విమ్స్ సర్కిల్), చిత్తూరులో పీసీఆర్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్ (గాంధీబొమ్మ సమీపం), మదనపల్లె జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో (ఆర్టీసీ బస్టాండు దగ్గర)ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. తిరుపతిలో జరిగే పోటీలకు చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి లోకల్ స్పాన్సర్‌గా ఉన్నారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. చిత్తూరులో జరిగే పోటీలను జీజేఎం ట్రస్టు, సుఖీభవ కళ్యాణ మండపాలు స్పాన్సర్ చేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయనున్నారు. మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజ్, ఆర్కే జ్యువెలర్స్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి.



బాబు రాకకు ముందే

కుప్పానికి అభివృద్ధి వరాలు

మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.92.20 కోట్లు మంజూరు
కడా కార్యాలయ విస్తరణకు రూ.42.20 కోట్లు
రోడ్ల మరమ్మతులకు రూ.34.27 కోట్లు
మహిళా శక్తి భవన నిర్మాణంకోసం 18.70 ఎకరాల కేటాయింపు

కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రాకకు ముందే కుప్పం ప్రజలపై వరాల జల్లు కురిసింది. కుప్పం మున్సిపాలిటీ, నియోజకవర్గ అభివృద్ధికోసం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవోలు విడుదల చేసింది. కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికోసం ఏకంగా రూ.92.20 కోట్లు మంజూరయింది. ఈ నిధుల్లో రూ.22 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, రూ.19.50 కోట్లతో మురుగు కాలువల నిర్మాణం, రూ.10 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కూడళ్లు, ప్రధాన రహదారుల సుందరీకరణ, రూ.19 కోట్లతో ఉద్యాన వనాల అభివృద్ధి, రూ.3 కోట్లతో విద్యుత్తు దీపాల ఏర్పాటు, రూ.70 లక్షలతో అంగన్‌వాడీ, వసతి గృహాలు తదితర ప్రభుత్వ భవనాల మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఇవిగాక మరికొన్ని అభివృద్ధి పనులు చేయనున్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని రహదారుల మరమ్మతులు, అభివృద్ధికోసం రూ.34.27 కోట్లు మంజూరయ్యాయి. ఆయా అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు.

● ఏపీఐసీసీకి 18.70 ఎకరాల కేటాయింపు

కుప్పంలో ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులోనూ మహిళలకు స్వావలంబన దిశగా మార్గాలను చూపడానికి నిశ్చయించారు. ఈ లక్ష్యంలో భాగంగా కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పలార్లపల్లెలో ఏపీఐసీసీకి 18.70 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ స్థలాన్ని అలీప్ అనే సంస్థకు కేటాయిస్తారు. వీరు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన శిక్షణతోపాటు వారి ఉత్పత్తుల తయారీకి తగిన మిషనరీని కూడా సమకూర్చడానికి అనువైన ఏర్పాట్లు ఇక్కడ చేయనున్నారు. కేటాయించిన స్థలంలో తొలుత మహిళా శక్తి భవనాన్ని, అనంతరం మహిళా పారిశ్రామిక వాడను నిర్మించనున్నారు. వీటికి కూడా సీఎం చంద్రబాబు తన కుప్పం పర్యటనలో స్వయంగా శంకుస్థాపన ఫలకాలను ఆవిష్కరించనున్నారు.



కార్వేటినగరంలో విద్యార్థులతో కలసి భోజనం తింటున్న ప్రభుత్వ విప్ థామస్

పండుగలా...

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

చిత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. దీన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుని మళ్లీ పునరుద్ధరించారు. డిసెంబరు 19న జరిగిన కేబినేట్ మీటింగులో ఈ అంశాన్ని ఆమోదించగా.. శనివారం నుంచి అన్ని కాలేజీల్లో ప్రారంభించారు. జిల్లాలో 31 జూనియర్ కాలేజీల్లోని 4091 మంది ఫస్ట్, 3998 మంది సెకండ్ ఇయర్ విద్యార్థులు శనివారం మధ్యాహ్నం కాలేజీలోనే భోజనం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పండుగ వాతావరణంలో ప్రారంభించారు. ఇదిలా ఉండగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దీనికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అని పేరు పెట్టిన విషయం తెలిసిందే. చిత్తూరు నగరంలోని పీసీఆర్ కాలేజీ, చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ ఆర్‌పేట కాలేజీలో ఈ పథకాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. పలమనేరులోని టీకేసీ జూనియర్ కాలేజీలో ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎమ్మెల్యే మురళీమోహన్, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ప్రారంభోత్సవం చేశారు. కుప్పంలోని ఎంఎఫ్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రారంభించారు. వి.కోట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పుంగనూరు బసవరాజ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభించారు. నగరి పీసీఎన్ కాలేజీలో నగరి ఆర్డీవో భవాని శంకరి హాజరయ్యారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం!

● చంద్రబాబు షెడ్యూల్‌లో కొనసాగుతున్న మార్పు చేర్పులు

కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఈనెల 6, 7, 8 తేదీల్లో ఖరారైన నేపథ్యంలో నియోజకవర్గంలో ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ రెండు రోజులుగా కుప్పంలోనే ఉంటూ ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలతో కలసి వారు శనివారం కుప్పం మండలం కంగుంది గ్రామానికి వెళ్లి అక్కడ సీఎం పర్యటనకకు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మునిరత్నం తండ్రి పీఆర్.శ్యామన్న విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్న నేపథ్యంలో కంగుందిలో నూతనంగా రోడ్లు నిర్మిస్తున్నారు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్తు లైన్లు మారుస్తున్నారు. అలాగే టీడీపీ కార్యాలయం ముందు భాగాన ఏర్పాటు చేసే వేదిక ద్వారా జన నాయకుడు గ్రీవెన్స్ సెల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ పరిసరాలను కూడా కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపై సమీక్ష జరిపారు.

● పర్యటనలో మార్పుచేర్పులు

ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన తేదీలు ఖరారైనా, మినిట్ టు మినిట్ కార్యక్రమం మాత్రం ఇంకా ప్రభుత్వం అప్రూవ్ చేయలేదు. ఎప్పటికప్పుడు స్వల్పమైన మార్పుచేర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతమున్న సమాచారం మేరకు... ముఖ్యమంత్రి చంద్రబాబు 6వ తేదీన ద్రావిడ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటారు. వర్శిటీ ఆడిటోరియంలో స్వర్ణ కుప్పం విజన్ 2029, నేచురల్ ఫార్మింగ్ విజన్ కార్యక్రమాలను ప్రారంభిస్తారు. స్వర్ణ కుప్పం 2029 పైన చర్చా కార్యక్రమం జరుపుతారు. అక్కడినుంచి అగరం కొత్తపల్లె చేరుకుని స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారు. కుప్పం మండలం నడిమూరు గ్రామంలో సోలరైజేషన్ పథకాన్ని ప్రారంభిస్తారు. శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో సమావేశమవుతారు. తిరిగి ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియం చేరుకుని టీడీపీ శ్రేణులతో సమావేశమవుతారు. రాత్రికి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. 7వ తేదీ ఉదయం టీడీపీ కార్యాలయం చేరుకుని జన నాయకుడు సెంటర్‌ను ప్రారంభిస్తారు. కార్యాలయం ఎదుట ప్రజలనుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. కుప్పం మండలం కంగుంది గ్రామంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం తండ్రి దివంగత పీఆర్.శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడినుంచి నేరుగా కుప్పంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానం చేరుకుంటారు. ఇక్కడ మదర్ ఫ్రూట్ అండ్ వెజిటబుల్స్ కంపెనీకి సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు, శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు సంబంధించిన డెయిరీకి శంకుస్థాపనలు చేస్తారు. కుప్పం పురపాలక సంఘానికి రూ.92 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తారు. నెట్ జీరో (కాలుష్య రహిత) నియోజకవర్గ ప్రాజెక్ట్ విషయంలో కాన్పూర్ ఐఐటీతో ఎంవోయూ కుదుర్చుకుంటారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే క్రమంలో మహిళా శక్తి భవన నిర్మాణానికి అలిప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఎన్‌డీడీబీ చైర్మన్, బిగ్ బాస్కెట్ సీఈవోలు, ఇతర అధికారులు, సీఈవోలతో సమావేశమవుతారు. అనంతరం శాంతిపురం కడపల్లె చేరుకుని సొంత గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తారు. తిరిగి ద్రావిడ విశ్వవిద్యాలయం చేరుకుని అకడమిక్ భవనం, కెరీర్ రీడినెస్ సెంటర్ భవనాలను ప్రారంభిస్తారు.ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ చేరుకుని రాత్రి బస చేస్తారు. 8వ తేదీ ఉదయం అమరావతి వెళ్తారు.



నడిమూరులో ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ఫలకాలు



కంగుందిలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పీఎస్ఎం తదితరులు



తిరుమలలో జాన్వీ కపూర్

తిరుమల, జనవరి4(ఆంధ్రజ్యోతి): నటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీ కపూర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మార్గంలో కాలినడకన శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్నేహితుడు శిఖర్‌తో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ఆలయం ముందు జాన్వీ కపూర్‌తో సెల్ఫీలకు అభిమానులు వెంటబడ్డారు. కాగా, జాన్వీ కపూర్ తన సోషల్ మీడియా అకౌంట్లలో శ్రీవారి లడ్డూ తింటున్న ఫొటోను పోస్ట్ చేశారు. ఇది తెగ వైరల్ అవుతోంది.

రైతు పురుషోత్తంనాయుడికి అభ్యుదయ పురస్కారం



మంత్రి, ఎంపీ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న రైతు పురుషోత్తం నాయుడు

రేణిగుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : రాస్ కేవీకే దత్తత రైతు పురుషోత్తం నాయుడుకు అభ్యుదయ పురస్కారం లభించింది. రామచంద్రాపురం మండలం మిట్టూరు గ్రామానికి చెందిన పురుషోత్తంనాయుడు వ్యవసాయంలో రాస్ కృషి కేంద్రం సూచనలతో ఆధునిక సాంకేతిక సమగ్ర వ్యవసాయ విధానం పాటిస్తూ పలువురు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించిన గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయనకు అభ్యుదయ రైతు పురస్కారం అందజేశాయి. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయులు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. రాస్ చైర్మన్ డాక్టర్ ఎఎస్.వెంకటరత్నం, కేవీకే హెడ్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు రైతు పురుషోత్తం నాయుడును అభినందించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ దర్శకుడు ఆదిత్య, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తెలంగాణ ఎమ్మెల్యే నవీన్‌కుమార్ ఉన్నారు.



ఆదిత్య



ఆర్పీ ఠాకూర్- మురళీమోహన్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.34 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 56,550

తలనీలాలు సమర్పించినవారు : 28,853



మహాక్షేత్రం : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం



ఆలయ గోపురం

ఏడు కొండలస్వామికి స్వయానా అన్న గోవిందరాజులు. కొండ మీద తమ్ముడికి భక్తులు నిలువు దోపిడీలు ఇచ్చి గోవిందలు పెడుతూ ఉంటే, కొండకింద ఉండే గోవిందరాజులు మాత్రం ఏడుకొండలస్వామికి వచ్చిన సొమ్మును లెక్కించి లెక్కించి అలసిపోయి, కుడిచేతిని తలకింద పెట్టుకుని పడుకుని ఉంటాడు.

అలసిన స్వామి!



తిరుపతి(కల్చరల్)

తిరుపతి పట్టణంగా ఉన్నపుడు.. ఎక్కడ నుంచి చూసినా ఆకాశంలోకి గర్వంగా తలెత్తి నిలబడి నేనున్నానన్నట్టుగా కనబడేది గోవిందరాజస్వామి గుడి గోపురం.

తిరుపతి నగరంగా మారినాక.. ఆకాశాన్ని తాకే బహుళ అంతస్థుల భవనాల నడుమ తొంగి చూస్తున్నట్టుగా కనిపించి మాయమవుతోంది ఈ మహాగోపురం.

దక్షిణ భారతదేశంలోనే పురాతన చారిత్రక ఆనవాలు గోవిందరాజస్వామి గుడి. తొలినుంచీ ఎందుకోగానీ తిరుమలలా, తిరుచానూరులా భక్తుల రద్దీ ఇక్కడ కనిపించదు. విశాలమైన ఆలయమూ, ఆదాయమూ ఉన్నప్పటికీ 15వ శతాబ్దం వరకూ ఈ ఆలయానికి పెద్దగా ప్రాశస్త్యం లేదు. శ్రీకృష్ణదేవరాయలు ఏడుమార్లు తిరుమలకు వచ్చినా, ఈ దారిలోనే శ్రీకాళహస్తికి వెళ్లినా గోవిందరాజులును ఎందువలననో దర్శించుకోలేదు. ఒక్క సాళువ నరసింగరాయలు మాత్రమే 1494 వరకూ ఈ ఆలయంపై శ్రద్ధ చూపించినట్లు తెలుస్తోంది. ఇదే ఆనవాయితీని ఇప్పటి పాలకులు కూడా కొనసాగిస్తున్నారు. తిరుమల కొండకు వచ్చే ప్రముఖులు, తిరుచానూరు అమ్మవారిని కూడా దర్శించుకుంటారు గానీ నగరం నడిబొడ్డున ఉండే గోవిందరాజస్వామిని మాత్రం దర్శించుకోవడానికి ఆసక్తి చూపించరు. అయినా సాధారణ భక్తులు మాత్రం, రైల్వే స్టేషనుకు ఎదురుగానే ఉండే ఈ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని వెళ్తుంటారు.



గోవిందరాజస్వామి ఆలయం



రాజగోపురం

ఇక గోవిందరాజస్వామిగుడి రాజగోపురాన్ని మట్ల కుమార అనంతరాయ అనే దేవచోళ కుటుంబానికి చెందిన రాజు క్రీ.శ. 1628లో నిర్మించారు. ఏడు అంతస్తులు, 50 మీటర్ల ఎత్తు ఉన్న గోపురం ఇది. గోపురం మీద రామాయణ ఘట్టాలను తెలిపే వందలాది శిల్పాలు ఉంటాయి.

గుడి నిర్మాణ చరిత్ర

క్రీ.శ.1130 తర్వాత ఈ ఆలయ నిర్మాణం 89 సంవత్సరాల పాటు పలు దశలుగా సాగింది. క్రీ.శ. 1219లో లోపలి గోపురం నిర్మాణం జరిగింది. అంచలంచెలుగా గుడి విస్తరణ జరిగింది. 1220న రామానుజ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దాని తరువాత 230 సంవత్సరాలకు 1457లో మరికొన్ని నిర్మాణాలు జరిగాయి. 1330వ సంవత్సరం నుంచి ఈ ఆలయానికి సంబంధించిన అనేక దానశాసనాలు లభిస్తున్నాయి. ఇద్దరు ద్వార పాలకులను నంద్యాల నారప్పరాయ అనే వ్యక్తి 1549 మార్చి 18న ఏర్పాటు చేసినట్టు శాసనం ఉంది. అలాగే క్రీ.శ. 1219లోనే గోవిందరాజ ఆయంలో అఖండదీపం వెలిగించేందుకు వీరనరసింహరాయల రాణి 32 గోవులను సమర్పించింది. విజయనగర ఆలయ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయంలోని వసంత మండపాన్ని అహోబిల మఠానికి చెందిన వన శఠగోప జీయర్ క్రీ.శ.1494లో నిర్మాణం చేశాడు. అయితే ఇది పూర్తి కాలేదు. దీనిని ఆ తరువాత రెండువేల పణాల సొమ్ముతో నల్లార్ అంగాండి అనే వ్యక్తి పూర్తి చేసినట్లు ఆధారాలున్నాయి. నీరాళి మండపాన్ని పోటు సమీపంలో అప్పాపిళ్లై అనే వ్యక్తి క్రీ.శ.1506లో నిర్మించాడు. క్రీ.శ.1497 ప్రాంతంలో చిత్రకూట మండపం, క్రీ.శ.1542 ప్రాంతంలో లక్ష్మీ మండపం వాడుకలోకి వచ్చినట్లు ఇందుకు సంబంధించిన దాన శాసనాల ద్వారా తెలుస్తోంది. వేదాంగదేశికకుల సన్నిధికి సమీపంలోని నాలుగుకాళ్ల మండపం 1494లో నరసరాజ ఉడైవరులు కట్టించారు.

ఉపాలయాలు : ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి (ఆండాళ్) ఆలయం, చక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం), విష్వక్సేనుడు, నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, తిరుమంగైయాళ్వార్, మధురకవి ఆళ్వార్, తిరుమలనంబి, రామానుజులు, కురుత్తాళ్వార్, సాలై నాచ్చియారు (పుండరీక వల్లీతాయారు) వంటి ఆలయాలున్నాయి.

ఆలయ వేళలు: రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 దాకా.

పూజలు, కైంకర్యాలు: తిరుమల తరహాలోనే సుప్రభాతం, తోమాల, అభిషేకం, ఏకాంత సేవలు జరుగుతాయి. టికెట్ ధరలు రూ.5 నుంచి రూ.20 దాకా మాత్రమే ఉంటాయి.

క్రీ.శ. 9,10 శతాబ్దాలనాటి కథ..

దక్షిణాదిలో శైవం పుంజుకుంది. విష్ణు ఆరాధనకు అడ్డంకులు ఏర్పడినాయి. అప్పటి చోళరాజు 1వ కుళోత్తుంగచోళుడు చిదంబరంలోని గోవిందరాజుల విగ్రహాన్ని ఆలయం నుంచి పెకిలించివేశాడు. హోయసల రాజ్యం (మైసూరు)లో ప్రవాసం ఉన్న రామానుజులు సూచనతో విగ్రహం తిరుపతికి చేరింది. అప్పటికే కపిల తీర్థానికి దక్షిణంగా ఉన్న కొత్తూరులో శ్రీపార్థసారథి ఆలయం ఉండేది. ఈ ఆలయ ప్రాకారంలోనే గోవిందరాజులకు ఒక గర్భగుడి నిర్మించారు. 1130 ఫిబ్రవరి 24న గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందంటారు. అందువలన ఈ గుడి ప్రాంతాన్ని గోవిందరాజపురం అని పిలిచేవారు. తర్వాత దీనినే రామానుజపురం అని పిలిచేవారు. తిరుపతి అనే పేరు ఎప్పటి నుంచి వాడుకలోకి వచ్చిందో చెప్పే ఖచ్చితమైన ఆధారాలు లేవు.

ముఖ్యమైన ఉత్సవాలు

వార్షిక బ్రహ్మోత్సవాలు: మే-జూన్‌లో ఎనిమిది రోజులు జరుగుతాయి. నాలుగవ రోజు గరుడసేవ జరుగుతుంది.

తెప్పోత్సవాలు: ఫిబ్రవరి మూడవ వారంలో ఆరు రోజులు జరుగుతాయి.

ఇంకా.. జనవరి రెండవ వారంలో పదమూడు రోజులు అధ్యయనోత్సవాలు, ఇదే నెలలో గోదా పరిణయం, మార్చిలో సాలై నాచియార్ పంగుణి ఉత్సవం, జూలైలో జ్యేష్ఠాభిషేకం మూడు రోజులు, సెప్టెంబరులో పవిత్రోత్సవం మూడు రోజులు, ప్రతి నెలా పున్నమి గరుడసేవ జరుగుతాయి.



ఆలయ పుష్కరిణి

జోరుగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు



స్వర్ణరథాన్ని ట్రయల్ రన్ చూస్తున్న అధికారులు - మహద్వార గేట్లను శుభ్రపరుస్తున్న సిబ్బంది - సెట్టింగుల కోసం తీసుకువచ్చిన సామగ్రి

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జనవరి 10న ఏకాదశి, 11న ద్వాదశిని పురస్కరించుకుని 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ గోపురం అలంకరణలకు లైట్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే మహద్వారం గేట్లను ప్రత్యేక రసాయనాలతో శుభ్రపరుస్తున్నారు. ఇక, ఈ ఏడాది ప్రత్యేకంగా మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్, పుష్పాలంకరణలు చేసే ప్రత్యేక నిపుణులను తిరుమలకు రప్పించారు. వారు ప్రస్తుతం ఆలయం ముందు ప్రత్యేకంగా ఓ షెడ్‌ను ఏర్పాటు చేసి, సెట్టింగ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏకాదశి సందర్భంగా నిర్వహించే స్వర్ణరథాన్ని కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. శనివారం స్వర్ణరథాన్ని కొంతదూరం ముందుకు కదలించి పనితీరును పరిశీలించారు. ఇక భక్తులకు ఇబ్బంది లేకుండా నారాయణగిరి వద్ద పటిష్ఠమైన క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.



విద్యుత్ అలంకరణల కోసం సిద్ధం చేస్తున్న లైట్లు

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్, ఈవో

వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమలలో జరుగుతున్న ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. ముందుగా బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌కు చేరుకుని అక్కడ స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీచేసే కేంద్రాలను చూశారు. తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణతేజ రెస్ట్ హౌస్ వద్దనున్న క్యూలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అన్నమయ్య భవనంలో ఏర్పాట్లపై టీటీడీ, జిల్లా, పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ టికెట్లు, టోకెన్లు ఉన్న వారికే వైకుంఠద్వార దర్శనాలు ఉంటాయని మరోసారి స్పష్టం చేశారు. వీఐపీలు వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 7 లక్షల మంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకుంటారనే అంచనా వేస్తున్నామని తెలిపారు. కాగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరుపతిలోని పలు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

అడవిలో దారితప్పిన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- జలపాతంలో విద్యార్థి మృతి
- అడవిలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది గాలింపు
- అర్ధరాత్రి విద్యార్థులను కనుగొన్న పోలీసులు



రైల్వే కోడూరుకు చేరుకున్న విద్యార్థులు

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవిలో దారి తప్పిన విద్యార్థులను శుక్రవారం అర్ధరాత్రి 12.40 గంటలకు కనుగొన్నారు. గుంజన జలపాతం సమీపంలోని సుడిగుండంలో పడిన ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని పానగల్ ప్రాంతానికి చెందిన పెద్దేశుగారి సాయిదత్ (ఓపెన్ డిగ్రీ విద్యార్థి) (26), పట్నం గిరి (బీటెక్ విద్యార్థి), తమ్మన్నగారి కేదార్‌నాథ్ (బీటెక్ విద్యార్థి), వి.దినేశ్ (చెన్నైలో ఉద్యోగి), పి.దినేష్ (బీటెక్), ఇ.మోహన్‌క్రిష్ణ (డిగ్రీ విద్యార్థి)లు తమ స్వగ్రామమైన పానగల్ నుంచి రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం శేషాచలం అడవిలో ఉన్న గుంజన జలపాతం వద్దకు రెండు మోటారు బైకుల్లో బయలుదేరారు. మాధవరం పోడుకు సమీపంలో ఉన్న వాగేటికోన మినీ రిజర్వాయర్ వద్ద మోటారు బైకులను పార్క్ చేసి అక్కడి నుంచి కాలినడకన గుంజన జలపాతం వెళుతుండగా నీటి ఒరవడి ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో జలపాతం వద్దకు వెళ్లలేకపోయారు. ఒక చిన్నపాటి కొండపై కూర్చున్నారు. ఇందులో సాయిదత్, మోహన్‌కృష్ణ, వి.దినేష్ జారి నీటి సుడిగుండంలో పడిపోయారు. కేదార్‌నాథ్, పి.దినేష్, గిరి నీటిలోకి దిగి మోహన్‌కృష్ణ, వి.దినేష్‌లను కాపాడారు. సాయిదత్ జాడ కనిపించలేదు. దినేష్ అక్కడి నుంచి పది కిలోమీటర్లు నడుచుకుని సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతానికి వచ్చి బంధువులు, 108కు సమాచారం అందించి లోకేషన్ పంపాడు. కొన్ని గంటల తర్వాత శవం నీటిపై తేలియాడింది. శవాన్ని బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సిబ్బంది కలసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టి అర్ధరాత్రి 12.40 గంటలకు వారు ఉన్న చోటును కనిపెట్టారు. తెల్లవారుజామున 4.30 గంటలకు వారంతా రైల్వే కోడూరుకు చేరుకున్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. సాయిదత్ శవాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష కోసం తరలించినట్లు ఎస్‌ఐ నవీన్‌బాబు తెలిపారు. సాయిదత్ మృతితో పానగల్‌లో విషాదచాయలు అలముకున్నాయి. సాయిదత్ ఆధ్యాత్మిక వేదికల్లో డ్రమ్స్ వాయిద్యం చేస్తుండేవాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ సమయంలో స్నేహితులతో కలిసి డ్రమ్స్ వాయిద్యాన్ని ఉచితంగా చేసేవారు.



మృతిచెందిన సాయిదత్

పాఠశాలలో 24 మంది విద్యార్థినులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు - పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేశాక వాంతులు, విరేచనాలు కావడంతో వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పాఠశాలలో 654 మంది చదువుతున్నారు. ఒకే ప్రహరీ ఆవరణలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉన్నాయి. తొలుత జూనియర్ కళాశాల విద్యార్థినులకు డొక్కా సీతమ్మ భోజనం పథకం కింద వంట చేశారు. ఆ వంట కార్మికులే తరువాత హైస్కూలులో భోజనం తయారు చేశారు. అయితే ఈ భోజనం సరిగ్గా ఉడకలేదని సమాచారం. పాఠశాల సమయం ముగుస్తుండటంతో హడావుడిగా ఈ అన్నం పెట్టారని విద్యార్థినులు చెబున్నారు. దీంతో స్వల్ప అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థులను చంద్రగిరి ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలు అందించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసరావు, చంద్రగిరి ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ అరుణలతో కలిసి బాధిత విద్యార్థినులను ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. కాగా వంట కార్మికులపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో తొలగించలేదు. వీరి నిర్లక్ష్యం వల్ల చాలాసార్లు భోజనం చేయడంలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు మంత్రి సవిత ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సవిత కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి సూచనలు ఇవ్వండి

- మైస్ టూరిజం కాన్ఫరెన్సులో కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలకు మంచి ప్రాధాన్యత ఉందని, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ జిల్లా పర్యాటక కౌన్సిల్ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లాలో మైస్ పర్యాటక రంగంపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. పలు యూనివర్సిటీల వీసీలు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ రంగ ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మైస్ టూరిజం అభివృద్ధికి గల అవకాశాలు,అనుసంధానం తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో 75 కిలోమీటర్ల నిడివి గల సముద్ర తీరం, ఆరు బీచ్‌లు, పలు పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయని,వాటి అభివృద్ధిపై సూచనలు,సలహాలు ఇవ్వాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఐఐటీ, ఐజర్, సంస్కృత కళాశాలలు,పలు యూనివర్సిటీలు ఉన్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ వెంకట్రావు, వినోద్‌గోపాల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి



తిరుపతి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణ మండపంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియబీ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండలస్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం డిసెంబరు ఆరు నుంచి నిర్వహిస్తున్న సదస్సులు ఈనెల 8వ తేదీతో ముగియనున్నాయని చెప్పారు. 822 రెవెన్యూ గ్రామాలుండగా, శనివారం నాటికి 741 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయన్నారు. 32,468 మంది రైతులు పాల్గొన్నారని, పదివేల అర్జీలు అందాయన్నారు. 300 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించామని తెలిపారు. మిగిలిన అర్జీలను కాలపరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని కలెక్టర్ అన్నారు.

ఆర్టీసీ కార్గో డోర్‌డెలివరీకి ఆదరణ



కార్గోలో పరిశీలిస్తున్న ఏటీఎం రామచంద్రనాయుడు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలకు ఆదరణ లభిస్తోంది. గత నెల 20న మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాకు 6,684 పార్సిల్స్ బుక్ చేయాలని యాజమాన్యం లక్ష్యమివ్వగా గడిచిన 15రోజుల్లో 6,390పార్సిల్స్ బుక్ చేశారు. ఈవిషయంలో జిల్లా రాష్ట్రంలో ఏడవ స్థానం లభించింది. మిగిలిన 15రోజుల్లో అదనంగా వందశాతం పార్సిల్స్ నమోదు చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఈనెల 19వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ఎస్వీయూలో ఫర్నిచర్‌ను అక్రమంగా అమ్మేశారు : ఏఐఎస్ఎఫ్



విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి(విద్య), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అధికారులు సుమారు రూ.60 లక్షల విలువజేసే పాత ఫర్నిచర్‌ను అక్రమంగా అమ్మేశారని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...యూనివర్శిటీ ఉన్నతాధికారులు విధి విధానాలను పాటించకుండా నచ్చినవారికి రహస్యంగా సామగ్రిని అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 20 లారీల సామగ్రి తరలిపోయిందన్నారు. ఈ సామగ్రి సుమారు రూ.60 లక్షలకు పైగా విలువజేస్తుందన్నారు. అధికారులు రికార్డుల్లో రూ. 8 లక్షలుగా పేర్కొన్నారన్నారు. ఉన్నత విద్యామండలి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు మోహన్, గుజారీ వ్యాపారు సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబక్షు, నగర నాయకులు విష్ణు, సురేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



ఏపీసదరన్ పవర్ సోలార్ వెండర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సదరన్ పవర్ సోలార్ వెండర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.మణిగండన్ కోరారు. శనివారం ఓ ప్రైవేటు హోటల్లో అసోయేసిషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగం మరింతమందికి ప్రయోజనం చేకూరేలా సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమ అసోసియేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాచారం కోసం 9885475551 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.చంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీకాంత్, మధు, కిషోర్, సభ్యులు పాల్గొన్నారు.

ధ్రువీకరణకేదీ సహకారం?

నత్తనడకన విండో సభ్యుల సర్వే ప్రక్రియ

స్థానికంగా అందుబాటులో లేని రైతులు

తలలు పట్టుకుంటున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (విండోల్లో) నమోదైన రైతుల ధ్రువీకరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రైతుల కోసం రైతుసేవా కేంద్రాల సిబ్బంది పరుగులు తీస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతు ముఖం, ఐరిష్, వేలిముద్రల ద్వారా అనుసంధానం చేయాలని వెసులుబాటు కల్పించారు. కొంతమంది స్థానికంగా అందుబాటులో లేరు. ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం, పిల్లల చదువులకోసం పట్టణ, నగర ప్రాంతాలకు వెళ్లారు. మరోవైపు జాబితాలో నమోదుచేసిన సెల్‌ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని యత్నించినా ఉలుకూపలుకు లేదు. ఓటీపీ చెప్పాలని అడిగితే కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలతో ఈకేవైసీ నమోదులో తీవ్ర జాప్యం జరుగుతోంది. త్వరగా పూర్తిచేయాలని అమరావతి నుంచి సహకారశాఖ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతుండడంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

బోగస్ ఓట్ల ఏరివేతకు ప్రభుత్వ నిర్ణయం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బోగస్ ఓట్ల ఏరివేతకు నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఈకేవైసీ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు సింగిల్ విండోల్లో రుణాలు, రాయితీల్లో అక్రమాలు జరుగుతున్నాయి. బోగస్ పేర్లతో దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రస్తుతం చేస్తున్న ధ్రువీకరణ ప్రక్రియద్వారా వీటిని కట్టడి చేయనున్నారు.

అత్యధికం.. అత్యల్పం

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 75 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. రైతు సేవా కేంద్రాలు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఈకేవైసీ జరుగుతోంది. రెండువారాలుగా జరుగుతున్న ఈ ప్రక్రియను ఈనెల పదో తేదీతో ముగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో 1,00,695 మంది రైతులతో ఈకేవైసీ చేయాల్సి ఉండగా, ఇంతవరకు 52,792 మందితో (52.43శాతం) ఈకేవైసీ (ధ్రువీకరణ) ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 47,903 మంది మిగిలి ఉన్నారు. గురువారం నాటికి అత్యధికంగా మండలాలవారీగా.. కార్వేటినగరంలో 3110 మందికి 2340 (77.74శాతం)మంది, పెద్దపంజాణిలో 2829 మందికి 2140 (75.65శాతం) మంది, గంగవరంలో 4244 మందికి 3079 (75.55శాతం) మంది ఈకేవైసీ పూర్తయ్యింది. అత్యల్పంగా.. నగరిలో 2787మందికి 1308 (26.87శాతం)మంది, కుప్పం అర్బన్‌లో 657 మందికి 185 (28.16శాతం)మంది, కుప్పం రూరల్‌లో 4366 మందికి 749 (29.96శాతం) మంది ఈకేవైసీ జరిగింది. గంగాధరనెల్లూరు మండలంలో అత్యధికంగా 5740 మంది రైతులుండగా, ఇంతవరకు 2751 (47.98శాతం) మంది ఈకేవైసీ పూర్తయ్యింది. మొత్తానికి ఆశించిన స్థాయిలో ప్రక్రియ జరగక అధికారులు మదనపడుతున్నారు.



మాధవరంలో రైతు వద్ద బయోమెట్రిక్ వేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం రెడ్డి

ముక్కంటి ఆలయ అతిథిగృహంలో అసాంఘిక చర్యలు

● సొంత అడ్డాగా మార్చుకున్న ఒప్పంద ఉద్యోగి కొడుకు



అతిథిగృహం గదిలో మందు సీసాలు - మోహన్‌రెడ్డి - మాధవరెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన వరదరాజస్వామి అతిథిగృహంలోని గదిలో కొందరు యువకులు మద్యం, మాంసం సేవిస్తూ చిందులేశారు. మందుబాబుల వెకిలికేకలను తాళలేక కొందరు భక్తులు తాగుబోతులను నిలదీస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాళహస్తికి చెందిన మాధవరెడ్డి ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తుంటాడు.కొంతకాలంగా నెహ్రూవీధిలోని వరదరాజస్వామి అతిథిగృహంలో పర్యవేక్షకుడిగా పని చేస్తున్నాడు. ఈయన కుమారుడు మోహన్‌రెడ్డి తరచూ అతిథిగృహంలో మిత్రులతో కలిసి అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించేవాడు. తన తండ్రి అక్కడ ఉద్యోగి కావడంతో అనుకున్నపుడల్లా గదిని తీసుకుని సొంత కార్యకలాపాలకు ఉపయోగించుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 7వ నెంబరు గదిని మోహన్‌రెడ్డి తీసుకున్నాడు. మిత్రులతో కలిసి మద్యం, మాంసంతో విందు చేసుకున్నారు. శనివారం సాయంత్రం 3గంటలకు కూడా వీరి గది నుంచి వెకిలికేకలు వినబడుతూనే ఉండటంతో కొందరు భక్తులు నిలదీశారు. దాంతో అక్కడి నుంచి కొందరు యువకులు జారుకున్నారు.ప్రధాన కారకుడైన మోహన్‌రెడ్డి మాత్రం మద్యం మత్తులో ప్రశ్నించినవారిపైనే ఎదురుదాడికి దిగాడు. దాంతో భక్తులు ఆలయ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈవో బాపిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే పోలీసులు అతిథిగృహం వద్దకు చేరుకుని మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.ఈవో బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు అతిథిగృహం వద్దకు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తండ్రి మాధవరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ఉద్యోగి లక్ష్మీరెడ్డిని సస్పెండ్ చేశారు. అసాంఘిక కార్యకలాపాల్లో కారకులైన మిగిలిన యువకులను కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగిన 'మహిళా కానిస్టేబుల్' ఎంపిక ప్రక్రియ



అభ్యర్థిని ఎత్తు కొలుస్తున్న పోలీసు అధికారులు - లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థిని

చిత్తూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఐదో రోజు కూడా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో కొనసాగాయి. శనివారం 496 మంది మహిళా అభ్యర్థులకు 274 మంది హాజరవగా, 80 మంది రాతపరీక్షకు అర్హత సాధించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ ఎను నిర్వహించారు. పరుగుపందెంలో అలసిన అభ్యర్థినులకు వైద్యులు ప్రథమచికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, టౌన్ డీఎస్పీ సాయినాథ్, తిరుపతి మహిళా డీఎస్పీ శ్రీలత, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు స్థానికుల దర్శన టోకెన్ల జారీ

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు కల్పించే దర్శన టోకెన్ల కోటాను ఆదివారం జారీ చేయనున్నారు. 7వ తేదీకి సంబంధించిన ఈ టోకెన్లను తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లోని కౌంటర్ల ద్వారా జారీ చేయనున్నారు. కాగా, ఈ టోకెన్లను పొందేందుకు స్థానికులు డైలామాలో పడ్డారు. ఒకవేళ ఇవి తీసుకుంటే మళ్లీ వైకుంఠద్వార దర్శన టోకెన్లు రావనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

79 మంది పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక

తిరుపతి(విద్య), జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన క్యాంపస్ ఎంపికల్లో 79 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. నాయుడుపేటకు చెందిన గ్రీన్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంపిక నిర్వహించగా 126 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో మెకానికల్ బ్రాంచి నుంచి 36 మంది, సివిల్-22, ఎలక్ట్రికల్ - 21 మంది మొత్తం 79 మంది ఉద్యోగాలు సాధించినట్టు చెప్పారు.

తిరుపతికి సరస్వతి నదీతీర్థం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంజునాథ్‌శర్మ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో పవిత్ర సరస్వతి నది జన్మస్థానం నుంచి జలాలలను తిరుపతి తీసుకువచ్చినట్టు టీత్వాల్ ఎల్‌ఓసీ శారదా యాత్ర మండల్ జాతీయ కార్యదర్శి మంజునాథ్ శర్మ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన సర్వతీ జలాల కలశాలను చూపుతూ వివరాలు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతం నుంచి ఈ నదీ జలాలను తీసుకువచ్చామన్నారు. ఈవిషయంలో అక్కడిముస్లింలు సహకరించారన్నారు. శ్రీవారి పాదాల చెంత ఆ జలాలను ఉంచి పూజ చేసేందుకు తిరుపతితీసుకువచ్చామన్నారు. అనంతరం కంచి, ఉజ్జయిని, అయోధ్య తీసుకువెళ్లి పూజలు నిర్వహిస్తామన్నారు. చివరిగా ప్రయాగరాజ్‌లోని కుంభమేళాకు తీసుకువెళ్లామన్నారు. తమ ప్రయత్నానికి హైదరాబాద్ శంకర్ ప్లాంజరీ ఫౌండేషన్, బెంగుళూరు లక్ష్మీ నరసింహ ట్రస్ట్, పాక్ ఆక్రమి కాశ్మీర్ శారద కమిటీ సేవ్ కాశ్మీర్, సర్వెంట్ సొసైటీ ఆఫ్ కాశ్మీర్ పండిట్స్, టీత్వాల్ లోక్ శారదా యాత్ర మండల్ సంపూర్ణ సహాయ సహకారాలను అందించాయని వివరించారు. విలేకరుల సమావేశంలో జీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం ఏవోగా బాపిరెడ్డి



బాపిరెడ్డి

తిరుపతి, జనవరి4(ఆంధ్రజ్యోతి) : శ్రీస్వామి హథీరాంజీ మఠం పరిపాలనాధికారిగా బాపిరెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఉన్న ఈయనకు ప్రభుత్వం హథీరాంజీ మఠం ఏవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. స్థానిక మఠం పరిపాలన కార్యాలయానికి సతీ సమేతంగా చేరుకున్న దంపతులకు వేద ఆశీర్వాదంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసుల రెడ్డి ఉన్నారు.

గొప్ప చరిత్రకు నెలవు గూడూరు

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ సమావేశాల్లో వక్తలు ● రెండు రోజుల సమావేశాలు ప్రారంభం ● హాజరైన పలు రాష్ట్రాలకు చెందిన 400మంది ప్రతినిధులు



పాల్గొన్న ప్రముఖులు - సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ చరిత్రకారుడు కాళిదాసు పురుషోత్తం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)/గూడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):గూడూరు ప్రాంతం ఎన్నో చారిత్రక విశేషాలకు నెలవని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశాలు గూడూరు ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో 'గూడూరు ప్రాంతంలోని ప్రాచీన హిందూ దేవాలయాలు' అంశంపై నెల్లూరులోని ప్రాచీన భారతీయ భాషల విశిష్ట అధ్యయన కేంద్రం సీనియర్ ఫెలో డాక్టర్ సోమరాజుపల్లె మమత అధ్యక్షోపన్యాసం చేశారు.ప్రాచీన నాగజాతి, బోయలకు కేంద్రస్థానంగా గూడూరు నిలిచిందన్నారు. మౌర్యులకు, శాతవాహనులకు వాణిజ్య కేంద్రంగా ఉండేదన్నారు. గ్రీకు, రోమన్, చైనా దేశాలతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను ఈ ప్రాంతం నెరిపిందన్నారు. దక్షిణాఫ్రికా, సింగపూర్, మలేషియాలకు వస్త్రాలను ఎగుమతి చేసిన చరిత్ర ఉందన్నారు. విందూరు చేపలు విదేశాలకు ఇక్కడి నుంచీ చేరాయన్నారు. నీలి మందు, పిచ్చిపొగాకు, వరిసాగులోనూ ఈ ప్రాంతం మొదటి స్థానంలో ఉందన్నారు. నిమ్మసాగులోనూ అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆధ్యాత్మిక, కళా నైపుణ్యానికి ఈ ప్రాంతంలోని దేవాలయాలు ప్రతీకలుగా ఉన్నాయన్నారు. గూడూరులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, కోదండరామ స్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, మూలస్థానేశ్వరస్వామి ఆలయం, భద్రకాళి-వీరభద్రస్వామి ఆలయం, శ్రీకృష్ణదాసు మఠం, తాళ్ళమ్మ ఆలయం, ఆంజనేయ ఆలయం, ధర్మరాజ ఆలయం వంటివి గొప్ప చరిత్రను కలిగి ఉన్నాయనారు.గూడూరులోని అలఘనాథ స్వామి ఆలయంలో లభించిన శాసనంలో గూడూరును కుముదంగా వ్యవహరించారనీ, కుముదం అంటే తామర పుష్పమనే అర్థం ఉందన్నారు. గూడూరు ప్రాంత చరిత్రను మరింతగా శోధించి కొత్త విషయాలను వెలికితీయవలసి ఉందన్నారు. నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ గిరి మాట్లాడుతూ.. చరిత్ర నుంచీ ఈ తరం నేర్చుకోవలసింది చాలా ఉందన్నారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. మరుగున పడిన చరిత్రను పరిశోధకులు వెలుగులోకి తీసుకురావాలన్నారు. నెల్లూరు సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కాళిదాసు పురుషోత్తం మాట్లాడుతూ.. చరిత్ర నుంచే సమాజ భవిష్యత్తు రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య చరిత్రలోని బహుముఖ కోణాలపై పరిశోధనలు సాగాల్సిన అవసరముందన్నారు.భావితరాలకు చరిత్రను అందించడమే ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య ముఖ్య లక్ష్యమని హైదరాబాదుకు చెందిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ డీన్ ప్రొఫెసర్ వనజ అన్నారు. అనంతరం ధర్మవరం ప్రాంతానికి చెందిన సిండే మారుతీరావు బృందం ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట ప్రదర్శించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో రాయలసీమ, మాతంగి వ్యవస్థ చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు.ఎస్వీయూ ఆర్కియాలజీ విభాగ రిటైర్డు ప్రొఫెసర్లు కిరణ్‌క్రాంత్ చౌదరి, నాగోలు కృష్ణారెడ్డి, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, చరిత్రకారులు కొప్పర్తి వెంకటరమణ, ఇనుగంటి చంద్రమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, స్థానిక కార్యదర్శి గోవిందు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా ఏఆర్ రామచంద్రారెడ్డి

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఏఆర్ రామచంద్రరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు చరిత్రకారులు ఆయన్ను అభినందించారు. చరిత్రను వెలికి తీయడంతో పాటు చరిత్రను నిర్మించడం, భవిష్యత్తు తరాలకు అందించడం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా రామచంద్రరెడ్డి పేర్కొన్నారు.

నేడు కార్యవర్గ సమావేశం

ఈ సమావేశాల్లో భాగంగా ఆదివారం ఏపీ హిస్టరీ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసే అవకాశం ఉంది. చరిత్ర బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అవసరమైన కృషికి సంబంధించి పలు అంశాలను తీర్మానాలుగా రూపొందించే అవకాశం ఉంది.

బాల్యవివాహాలు నేరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఆదినారాయణ

పలమనేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నేరమని పలమనేరు సివిల్ జడ్జి ఆదినారాయణ పేర్కొన్నారు. శనివారం పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి ఆదినారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా.. సహకరించినా నేరమేనన్నారు. బాల్యవివాహాలు మహిళ లకు అత్యంత ప్రమాద కరమన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడరాదని పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందజేశారు. అనంతరం అంబేడ్కర్ సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో న్యాయవాదులు అరిఫుల్లాఖాన్, రంజిత్‌షా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్, కళాశాల సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన టెన్నికాయిట్ జిల్లా జట్టు

సోమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కందూరు ఉన్నత పాఠశాలలో శనివారం ఉమ్మడి జిల్లాల జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక జరిగినట్లు జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి, పీడీ చిన్నప్ప తెలిపారు. ఉమ్మడి జిల్లాల నుంచి 65 మంది హాజరు కాగా.. వీరిలో ఎనిమిది మందిని ఎంపిక చేశారు. ఈ నెల 11, 12 తేదీలలో శ్రీకా కుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. జిల్లా జట్టులో బాలురు విభాగంలో పీలేరు హైస్కూల్ విద్యార్థులు లలిత్ కుమార్, ప్రవీణ్‌కుమార్, ముదివేడు నుంచి సమీర్, సోహేల్, బాలికల విభాగంలో కందూరు హైస్కూల్ విద్యార్థిని పల్లవి, చిలమాకులపల్లె (నగిరి) హైస్కూల్ విద్యార్థినులు పూజ, గాయత్రి, భాను ప్రియలు ఎంపికయ్యారు. టెన్ని కాయిట్ పోటీలను సోమల పీడీ కరుణానిధి, ముదివేడు పీడీ ఉమ, పీలేరు, సూరయ్యగారిపల్లె పీడీలు నాయక్, శివకుమార్‌లు పర్యవేక్షించారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం వెంకట్రమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజనాలబండ ఆలయ రికార్డుల తనిఖీ

చౌడేపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనా లబండ ఆలయ రికార్డులను టీటీడీ ఆడిటర్ మనోజ్ శనివారం తనిఖీ చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు చేశారు. వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పద్యాల పోటీల్లో కీలపట్ల విద్యార్థుల ప్రతిభ


బహుమతులు సాధించిన విద్యార్థులు

గంగవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేమన జయంతిని పురస్కరించుకొని శని వారం గంగవరం మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అనం తపురంకు చెందిన వేమన ఫౌండేషన్ నిర్వాహకులు పద్యాల పోటీలు నిర్వహిం చారు. పోటీలలో వందకు పైగా పద్యాలు చెప్పిన విద్యార్థులను గుర్తించి అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందిం చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దామోదరం, తులసీనాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



కల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల సమీపంలో శని వారం వేకువజామున ఎర్రచం దనం దుంగలతో సహా నిందితు డిని అరెస్టు చేసినట్లు అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురు ప్రభాకర్ తెలిపారు. డీఎఫ్‌వో కథనం మేరకు.. శేషాచలం అటవీప్రాంతం నుంచి పులిచెర్ల మీదుగా ఎర్రచం దనం అక్రమ రవాణా ముందస్తు సమాచారంతో శనివారం వేకువజామున పులిచెర్ల సమీపం మంగళంపేట రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ కారు పోలీసులను గమనించి కొంత దూరంలో కారును ఆపి నలుగురు వ్యక్తులు పారిపోయారు. గమనించిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది కారు వద్దకు చేరుకొని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తమిళనాడు రాష్ట్రం విల్లుపురంకు చెందిన సతీష్ (22)గా గుర్తించారు. 320 కిలోల 11 ఎర్రచందనం దుంగలతోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నింది తుడు సతీష్‌ను రిమాండుకు పంపారు. దాడుల్లో ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ బీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ 2.0 పథకం ప్రారంభం



కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో తాగునీటి సరఫరాను మెరుగుపరిచే అమృత్ 2.0 పథకాన్ని శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఇందులో భాగంగా డీకేపల్లె వద్ద వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీలో తాగునీరు, మురుగు నీటి వ్యవస్థలను మెరుగు పరిచేందుకు అమృత్ 2.0 పథకంలో రూ.9.21 కోట్లు వ్యయం చేయనున్నట్లు చెప్పారు. కుళాయి కనెక్షన్లతో నీటి సరఫరా, శుద్ధజలం, పైపులైన్ల విస్తరణ వంటి పనులు చేపడతామన్నారు. డీకేపల్లెలో శుద్ధజలం కోసం వీఎం.ఎల్.డి. సామర్థ్యం గల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ

బైరెడ్డిపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మన పల్లె గురుకుల పాఠశాలలో శని వారం తీర్థం పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ ఆరోగ్య సంరక్షణపై విద్యార్థినులకు అవ గాహన కల్పించారు. రుతుక్ర మంలో వచ్చే ఇబ్బందులు.. వాటి నివారణ, వ్యక్తిగత శుభ్రత, పోషకా హార ప్రాధాన్యత, బాల్యవివాహాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభ, సీహెచ్‌వో సాయిదివ్య, రేవతి పాల్గొన్నారు.

'విజ్ఞానసుధ'లో 127 మందికి ఉద్యోగాలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో 127 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని చైర్మన్ శ్రీధర్ తెలిపారు. తమ కళాశాలలోని డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పది కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో హాస్టల్ విద్యార్థుల ప్రతిభ



చిత్తూరు క్రీడలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ బాలుర హాస్టల్ విద్యార్థులు పతకాలు సాధించారని వార్డెన్ సురేష్ తెలిపారు. జమ్ము కశ్మీర్‌లో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు వంశీకృష్ణ (10వ తరగతి) బంగారు పతకం, ప్రకాష్ (9వ తరగతి) కాంస్య పతకం సాధించారని చెప్పారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగు లకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శనివారం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసు పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, సభ్యులుగా నాగరాజు, సుధాకర్, విశ్రాంత ప్రభుత్వ వైద్యులు సుబ్రహ్మణ్యం, చంద్రకళ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పలమనేరు ఆసుపత్రిలో వైద్యులు అందు బాటులో ఉంటూ సేవలందించాలని.. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. డాక్టర్ల కొరత, మౌలిక సదుపాయాలు, పారిశుధ్య సిబ్బంది వేతనాలు తదితర సమస్య లను ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో శారద, మున్సిపల్ కమిష నర్ ఎంవీ రమణారెడ్డి, సూపర్ బజార్ అధ్యక్షులు బాలాజీ, టీడీపీ నాయకులు కిషోర్‌గౌడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్య క్షులు రామచంద్రనాయుడు, ఆసుపత్రి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందుకున్న విద్యార్థులు

వి.కోట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వి.కోటలోని ఆదర్శ పాఠ శాలలో ప్రత్యేక ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షులు మధుసూదన్, సేవాదళ్ సమన్వయకర్త గజేంద్ర రెడ్డి, సేవా సమితి కన్వీనర్ చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు నగేష్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం.. ఒకరి అరెస్టు


నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాటుసారాను తరలి స్తున్న వ్యక్తితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. శని వారం మండలంలోని నల్ల గుట్లపల్లెతాండాకు చెందిన రవినాయక్ ద్విచక్రవాహనంలో నాటు సారాను పూజగానిపల్లె క్రాస్‌లో అక్రమంగా తరలిస్తుండగా పట్టు బడినట్లు చెప్పారు. 36 లీటర్ల సారా, వాహనాన్ని స్వాధీనం చేసు కొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, జవహర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు బాలాజికి పురస్కారం

పలమనేరు, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఎస్‌వి. యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో బీసీ సంఘర్షన సమితి చే బహు జన సామాజిక రచయిత పురస్కారాన్ని రచయిత పలమనేరు బాలాజికి నేడు అందజేయనున్నారు. కథా, కవిత, నవల, విమర్శ రంగాల్లో 1991 నుంచి పలమనేరు బాలాజి రచనలు చేస్తున్నారు.

9న 'ఉపాధి' బహిరంగ సభ

గంగవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల తనిఖీ సంబంధించి ఈనెల 9న గంగవరం ఉపాధి హామీ భవనం ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తు న్నట్లు ఏపీవో శ్రీనివాస్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. సంబంధిత అధికారులు, రైతులు, కూలీలు హాజరుకావా లని ఆయన కోరారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

పలమనేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియే షన్ క్లబ్ ఆవరణలో ఈనెల 5న ఆదివారం ఉచిత నేత్ర వైద్యశి బిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు పరీ క్షించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవ కాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం: ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మో హన్ అన్నారు. శనివారం పీసీఆర్ కళాశాల రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన నూతన ఎక్స్‌కవేటర్, మూడు ట్యాంకర్లను మేయర్ అముదతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాతబ స్టాండు అభివృద్ధిలో భాగంగా పీసీఆర్ రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఫ్రూట్‌స్టాల్స్ షెడ్డును కూడా ప్రారంభించారు. పాత బస్టాండ్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం ఇప్ప టికే పురపాలక శాఖ మంత్రితో మాట్లాడానని ఎమ్మెల్యే చెప్పారు. కైలాసపురం శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పరిశీలిం చారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిష నర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నవి.. కడుపునింపే చదువులు


కుప్పంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల


పలమనేరులో విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


పుంగనూరులో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబు కడుపు నింపే చదువులు చదివిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. కుప్పం పట్టణంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలల్లో వారు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. స్వహస్తాలతో వడ్డించి విద్యార్థులతో కూర్చుని భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్య క్షుడు రాజ్‌కుమార్, ఎంఈవోలు మహబూబ్ బాషా, రాజారాం, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●పలమనేరు: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని పలమనేరు ఎమ్మెల్యే అమ రనాథరెడ్డి సూచించారు. శనివారం పలమనేరు ప్రభుత్వ టీకేసీ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు ఆర్. వి. బాలాజీ, ఆర్బీసీ కుట్టి, ఎంఈవో లీలారాణి, కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్యశెట్టి, అధ్యాపకులు శ్రీనివాసులు, సుధారాణి, బీఎస్ ప్రసాద్, గిరిబాబు, సుబ్రహ్మణ్యంగౌడు, నాగ రాజు, ఖాజా, చాంద్‌బాషా, మదన్, శ్రీధర్, కిరణ్, బీఆర్సీ కుమార్, మురళీ, భాస్కర్, సుబ్బు, శ్రీను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు: విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం ఓ వరమని పుంగనూరు టీడీపీ ఇన్‌చా ర్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పుంగనూరు బసవరాజ ప్రభుత్వ బాలుర జూని యర్ కాలేజీలో ఆయన మధ్యాహ్న భోజన పథ కాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ దయానందరాజు, టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, మాధవరెడ్డి, సీవీరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ కె.సుకుమార్‌బాబు, పోలీ సుగిరి, సుహేల్‌బాషా, వెంకటముని, శమీపతి, రామకృష్ణమరాజు, గంగాధర్, దేశాధి ప్రకాశ్, జనసేన నేతలు పగడాల రమణ, చిన్నరాయల్, విరూపాక్షి, శ్రీనివాసులు, రమణ పాల్గొన్నారు.

●రామకుప్పం: రామకుప్పం ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శనివారం టీడీపీ మండలా ధ్యక్షులు ఆనందరెడ్డి మధ్యాహ్న భోజన పథ కాన్ని ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి నరసిం హులు, మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, ప్రిన్సిపాల్ చాణ క్యుడు, టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణా నాయక్, సలాంసాబ్, మనోహర్, కామరాజనా యక్, గజేంద్ర, నాగభూషణం, టీవీ రవి, విజ య్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, సుబ్రీ, మురళీమో హన్, అంజి, శ్రీరాములు, సుబ్బయ్య, బీజేపీ నేతలు రాజసింహ, ఆనంద్, అప్పస్వామి, కార్తీక్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

●కల్లూరు: పులిచెర్ల మండలం ఎల్లంకివారి పల్లి నందవనం జూనియర్ కళాశాలలో శని వారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథ కాన్ని ప్రారంభించారు. రాష్ట్ర తెలుగు రైతు ఉపా ధ్యక్షులు రామనాథంనాయుడు, ఎంపీడీవో రాజ శేఖర్‌బాబు, ప్రిన్సిపాల్ తులసిరామ్, ఎంఈ వోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, నాయ కులు శ్రీనివాసులునాయుడు, గోపినాయుడు, మునిరత్నం, పంచాయతీ కార్యదర్శి శ్రీబాబు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●సోమల: సోమల జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో పిన్సిపాల్ గంగాధరం నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు నాగ భూషణం రాయల్, టీడీపీ నాయకులు శ్రీనివా సులు నాయుడు, కోటీశ్వరరావు, ఎంఈవో శివర త్నమ్మ, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, ఎస్ ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: స్థానిక జూనియర్ కాలేజీలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్య క్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు ప్రదీప్ రాజు, చంద్రమౌళి, కుమార్‌రెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ప్రిన్సిపాల్ జయప్రకాష్, అధ్యాపకులు బాలాజీ, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

●సదుం: సదుం జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజనం పథకం ప్రారం భించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనాథ రెడ్డి, తహసీల్దారు ఎస్‌ఎం హుస్సేన్, ఎంఈవో దామోదర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

●గుడుపల్లె: ప్రభుత్వ జూనియర్ కళాశా లలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వరమని టీడీపీ మండలాధ్యక్షులు బాబునాయుడు పేర్కొ న్నారు. శనివారం గుడుపల్లె ప్రభుత్వ జూని యర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు, ఎంఈవోలు శ్రీదేవి, లక్ష్మయ్య, మండల పార్టీ జనసేన అధ్యక్షులు అమీర్, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, ఎల్లప్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●శాంతిపురం: పేద విద్యార్థుల కడుపులు నింపడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టిందని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు తెలిపారు.

●వి.కోట: వి.కోట ప్రభుత్వ జూనియర్ కళా శాల, బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం జడ్పీ చైర్మన్ శ్రీనివా సులు ప్రారంభించారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి


అంధుల దినోత్సవంలో పాల్గొన్న ఎంఈవో లీలారాణి

పలమనేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అంధుల దినోత్స వాన్ని శనివారం పలమనేరు భవిత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం మాట్లా డుతూ లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ అంధుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు మంగేశ్వరి, మురళీ, విద్యానగర్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు భారతి, సీఆర్‌పీ గీత తదితరులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: స్థానిక భవిత కార్యాలయంలో ఎంఈవో కేశవరెడ్డి ఆధ్వ ర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సమానంగా అంధులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలమ్మ, ఉపాధ్యాయులు హరినాథ్, శంకర్, భవిత సిబ్బంది రామ్మోహన్, రోజా, వసంత తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు: ప్రపంచ అంధుల లిపి రూపకర్త లూయిస్ బ్రెయిలీ జన్మ దిన వేడుకలను పుంగనూరు భవిత కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు. శనివారం స్థానిక భవిత కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది వెంకటరమణ, అరుణ, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: మండలంలోని భవిత కేంద్రంలో దృష్టిలోపం ఉన్న వారికి చదవడానికి, రాయడానికి బ్రెయిలీ లిపి తయారు చేశారని ఎంఈవో ఇందిర అన్నారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహిం చారు. ఎంఈవో-2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఇర్షాద్, అమ్ములు, మానస, సీఆర్‌పీ కిరణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం



పుంగనూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం మాలేనత్తం గ్రామ పంచాయతీ కొండూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న లావణ్య (32) శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అంగన్వాడీ సూపర్‌వైజర్ వేధింపులు తాళలేక తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితు రాలు తెలిపింది. ప్రతి చిన్న విషయంపై తనను సూపర్‌వైజర్ వేధిస్తోం దని, పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోలేదని వాపోయింది.

పాఠశాల అభివృద్ధికి ఎస్‌ఎంసీ సహకరించాలి

కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజింగ్ కమిటీ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని అడవిబూదుగూరులోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతుగుంట చిట్టిబాబు కోరారు. పాఠశాల ఆవరణలో శనివారం ఎస్‌ఎంసీ సభ్యులకు విధులు, బాధ్యతలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల హాజరు, విద్యా స్థాయి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణ, మనబడి - మన భవిష్యత్తు, పాఠశాలకు విడుదలైన నిధుల వివరాలు, వాటి వినియోగం, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ జగదీశ్, వైస్ చైర్మన్ మునిలక్ష్మి, ఉపాధ్యాయులు నరేంద్రబాబు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిచెర్ల ఏవోగా హరిప్రసాద్



కల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల వ్యవసాయాధికారిగా హరి ప్రసాద్ శనివారం బాధ్యతలు చేప ట్టారు. ఈయన సదుం మండల ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏవో మాట్లా డుతూ రైతులకు అందుబా టులో ఉంటూ వ్యవసాయా భివృద్ధికి కృషి చేస్తాన న్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని కోరారు.

రైతుల సంక్షేమమే కూటమి లక్ష్యం



కనుమలదొడ్డిలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సంక్షే మానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌ నివారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం శాంతిపురం మండలం కను మలదొడ్డిలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్ర మంలో తహసీల్దారు శివయ్య, నేతలు సుగుణమ్మ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: రైతుల భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం బోడిపాటివారిపల్లె లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, ఆర్‌ఎస్‌డీటీ లోకేష్, ఆర్‌ఐ సుధాకరనాయక్, సర్వేయర్ ద్వారకనాథ్, టీడీపీ నాయకులు నాగార్జున నాయుడు, మేడసాని రవికుమార్ పాల్గొన్నారు.

●కల్లూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జయసింహ తెలిపారు. పులిచెర్ల మండలం 102 ఈ.రామిరెడ్డిగారిపల్లిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ దొరస్వామి పాల్గొన్నారు.

●రామకుప్పం: రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న అ న్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి తెలిపారు. శనివారం తి మ్మసముద్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దారు బాబు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రామకృష్ణప్ప, టీడీపీ నేతలు కేశవరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు

కల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపే టలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వ హించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీ నరసింహ స్వామి భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా మంగ ళంపేటకు చెందిన వేణుగోపాల్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేద్దాం: టీడీపీ


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనను విజ యవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్‌లు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం వారు కుప్పం పురపాలక సంఘం, కుప్పం మండలం పార్టీ శ్రేణులతో వేర్వేరుగా సమావే శమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 6, 7, 8వ తేదీలలో కుప్పంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని, శంకుస్థాప నలు చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్య టనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజ యవంతం చేయడానికి సహకరించాలని కోరారు. సమావేశాలలో టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం మండల అధ్యక్షులు రాజ్ కుమార్, ప్రేమ్‌కుమార్‌లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●గుడుపల్లె: మండలంలో చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలను కృషిచేయాలని టీడీపీ మండలాధ్యక్షులు బాబు నాయుడు కోరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈనెల 6న సీఎం చంద్రబాబు నాయుడు మండలంలోని ద్రావిడ విశ్వవిద్యా లయంలో పర్యటనకు భారీగా ప్రజల తరలివ చ్చేలా చూడాల్సిన బాధ్యత నాయకులదేన న్నారు. సీఎం మాజీ పీఏ మనోహర్, నియోజ కవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశే ఖర్, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర సాధికారిక అధ్య క్షులు మునిరాజు, మండల పార్టీ జనసేన అధ్యక్షులు అమీర్, హేమాంబర్‌గౌడు, బేటప్ప నాయుడు, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, శ్రీనివా సులు, చంద్రప్ప, ప్రకాష్, భానుమూర్తి, లక్ష్మీ పతి, వెంకటేశ్, రమేష్, వాసు, మంజునాథ్, శీనప్ప, గోవిందు, వెంటాచలం, రామచంద్ర, గంగాధర్, వెంకటరాముడు, గోపి, యుగంధర్ రెడ్డి, వెంకటేష్, మునస్వామి, విజయ్ పాల్గొ న్నారు.

●శాంతిపురం: సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటనను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివా సులు, టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడులు కోరారు. శనివారం శాంతిపు రంలో జరిగిన కార్యక్రమంలో నేతలు విజయ రామిరెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ నాగరాజు పాల్గొన్నారు.

వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అమ్ముకున్న వైవీ: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్ తదితరులు

చిత్తూరు సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అమ్ముకున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో సుమారు 4లక్షల వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి అమ్ముకున్నారని చెప్పారు. బాగున్న సత్రాలను కూలగొట్టి.. కోట్లాది రూపాయలతో పనులను వైసీపీ కార్యకర్తలకు అప్పగించారన్నారు. సొంత కాంట్రాక్టర్ల ద్వారా నాసిరకమైన పదార్థాలు కొనుగోలు చేసి శ్రీవారి లడ్డూలోనూ చేతివాటం చూపించారని అన్నారు. శ్రీవాణి ట్రస్ట్ పేరిట కనీసం ఆడిటింగ్ కూడా లేకుండా లక్షలాది రూపాయల వసూలు చేసి దిగమింగారని మండిపడ్డారు. టీటీడీ, అనుబంధ విద్యా సంస్థలు, వైద్యశాలల్లో ఉద్యోగాలను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారన్నారు. పరకామణిలో వచ్చిన విదేశీడాలర్లను పక్కదారి పట్టించారని, పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. దోచుకున్న సొమ్మును సీబీసీఐడీ ద్వారా విచారణ జరిపించి మొత్తం కక్కిస్తామన్నారు. ఈ సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, విజయ్ కుమార్, ధరణి ప్రకాష్, మధుకుమార్ యాదవ్, షబ్బీర్ బాషా, ముత్యం రామచంద్రయ్య, మురళి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సబ్‌స్టేషన్‌లో అత్యవసరమైన మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు టౌన్ పూర్తిగా(గిరింపేట మినహా), చిత్తూరు రూరల్ మండలం, గుడిపాల, యాదమరి మండలాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

నగరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని గుండ్రాజకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో-2 నమశ్శివాయం శనివారం ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, సభ్యులు పళని, మోహన్, సింధు, జయపాల్, జయానందం తదితరులు పాల్గొన్నారు.

చెరువులో బండరాళ్లు, మట్టి పడేస్తారా?

ఎక్స్‌ప్రెస్ హైవే కాంట్రాక్టర్ తీరుపై బండివాళ్లవూరు గ్రామస్తుల ఆందోళన

యాదమరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో బండరాళ్లు, మట్టి పడేస్తారా? అంటూ ఎక్స్‌ప్రెస్ హైవే కాంట్రాక్టరు తీరుపై బండివాళ్లవూరు గ్రామస్తులు నిరసన తెలిపారు. యాదమరి మండలం మీదుగా నిర్మిస్తున్న చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే ఆరు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా బండివాళ్లవూరు పరిధిలోని బండివానిచెరువు మీదుగా రెండు భారీ వంతెనలను కట్టారు. ఈ క్రమంలో పెరుమాళ్లపల్లె సమీపంలో రహదారి నిర్మాణానికి అవసరమైన కంకర, తారు, ముడి సరుకుల నిల్వ కోసం ఓ కేంద్రం నిర్మించుకున్నారు. అక్కడ మిగిలిన పెద్దపెద్ద బండరాళ్లు, వ్యర్థాలను, మట్టిని బండివానిచెరువులో నాలుగు రోజులుగా డంపింగ్ చేస్తున్నారు. శనివారం ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు జనార్దన్, కృష్ణమూర్తి నాయుడు, సతీష్ నాయుడు తదితరులు చెరువును పరిశీలించారు. చెరువు వ్యర్థాలతో నిండిపోయి ఉండటంతో వెంటనే తహసీల్దార్ పార్థసారథికి ఫోన్ ద్వారా విషయం తెలియజేశారు. ఆయన సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. చెరువులో వ్యర్థాలను వెంటనే తొలగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళతామని తహసీల్దార్ తెలిపారు.



బండివానిచెరువులో మట్టి, బండరాళ్లు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్థసారథి

సంక్షిప్తంగా..

దుప్పట్ల వితరణ

చిత్తూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో వారం రోజులుగా చలి తీవ్రత పెరగడంతో మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు.. యాచకులకు, వృద్ధులకు, కుష్ఠు రోగులకు, ఆలయాల్లో పనిచేసే సిబ్బందికి దుప్పట్లను శనివారం వితరణ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ క్యాలెండర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఆర్వో మోహన్‌కుమార్ ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి రామచంద్రయ్య, గౌరవ అధ్యక్షుడు ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ తనిఖీ

చిత్తూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని రెడ్డిగుంట సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ శనివారం తనిఖీ చేశారు. ఆయనవెంట చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్ తదితరులున్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

గుడిపాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మరకాలకుప్పం పాఠశాల హెచ్‌ఎం జె.లక్ష్మీదేవి ఉత్తమ టీచర్ అవార్డు పొందడంతో మండల మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్, మాజీ సర్పంచ్ మార్కొండ యాదవ్ శనివారం సన్మానించారు. టీచర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆకతాయిల నుంచి రక్షించండి

గుడిపాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'బొమ్మసముద్రం ప్రభుత్వ పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. వారి నుంచి రక్షణ కల్పించండి' అని హెచ్‌ఎం విజయలక్ష్మి, విద్యార్థులతల్లిదండ్రులు కోరారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. పాఠశాల వదిలే సమయంలో కొందరు ఆకతాయిలు పాఠశాల ఆవరణంలోకి వచ్చి బైకు రేసులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. రాత్రివేళల్లో మందుబాబుల ఆగడాలూ ఎక్కువైందన్నారు. విద్యార్థులు రావాలన్నా భయపడుతున్నారని వాపోయారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పాలసముద్రం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. శనివారం సింహరాజుపురంలో సదస్సు జరిగింది. డీటీ రిషివర్మ, ఆర్ఐ దేవి, సర్వేయర్, వీఆర్వో పాల్గొన్నారు.

పెనుమూరు: శాతంబాకంలో నిర్వహించిన సదస్సులో 52 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, సర్పంచ్ జయచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, హరిబాబు, వీఆర్వో పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: 49.కొత్తపల్లె గ్రామ పంచాయతీ బసివిరెడ్డిపల్లెలో సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ లోకనాథం పిళ్ళై, డీటీ రవీంద్రబాబు, సర్వేయర్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: వసంతాపురం గ్రామ సచివాలయంలో సదస్సు జరిగింది. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ రజినీకాంత్, టీడీపీ నేతలు జయదేవనాయుడు, బాబురెడ్డి, ఆర్ఐ రామసాయి,మాజీసర్పంచ్‌రెడ్డెప్పపాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం ఎంఎం విలాసంలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు

పెనుమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి విద్యుత్ బిల్లు చెల్లించవచ్చని ఏఈ తులసిప్రసాద్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ జనవరి నెల బిల్లులో క్యూఆర్ కోడ్ ఇచ్చామన్నారు. దాన్ని స్కాన్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంద్వారా చెల్లించవచ్చని చెప్పారు.

డాక్టరేట్ ప్రదానం



నింద్ర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని విట్ యూనివర్సిటీలో నానో టెక్నాలజీపై ఏడేళ్ల పరిశోధన చేసిన విజయ్‌కాంత్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. నింద్ర మండలం కొప్పేడు దళితవాడకు చెందిన ఈయన ఎస్వీయూలో డిగ్రీ చదివారు. అనంతరం విట్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ కృష్ణమూర్తి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు.

తెలుగు తమ్ముళ్లకు ఎమ్మెల్యే పరామర్శ



పాదిరికుప్పంలో దామును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తుపాను సమయంలో ఇల్లు కూలి గాయపడిన మునికృష్ణయ్య శస్త్ర చికిత్స తర్వాత కార్వేటినగరం వచ్చారు. ఆయన్ను శనివారం ఎమ్మెల్యే థామస్ పరామర్శించారు. అలాగే పాదిరికుప్పంలో అనారోగ్యం పాలైన రాష్ట్ర ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు దామును పరామర్శించారు. ● జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీని ఎమ్మెల్యే అభినందించారు.

తహసీల్దార్‌పై థామస్‌కు ఫిర్యాదు: ఈ తహసీల్దార్ మాకొద్దు.. అంటూ శనివారం థామస్‌కు తెలుగు తమ్ముళ్లు ఫిర్యాదు చేశారు. టీడీపీ ముఖ్య నేత సాతాల గుణశేఖర్ సహా పలువురు తెలుగు తమ్ముళ్లు విప్‌ను కలిసి ఈ విషయం తెలిపారు. వైసీపీ సానుభూతిపరులకు సానుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు.

వన్నియకుల క్షత్రియ మెంబరును తొలగించాలి: వన్నియకుల క్షత్రియ మెంబరు రాజేంద్రరెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని కార్వేటినగరం మండలంలోని ఆ సంఘ నాయకులు శనివారం విప్‌కు ఫిర్యాదు చేశారు. రాజేంద్రరెడ్డి.. 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన వాడని చెప్పారు. ఇదే విషయాన్ని కలెక్టరు సైతం ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఘటన టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

క్రీడాకారులకు దాతల చేయూత

యాదమరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పూర్వవిద్యార్థులు చేయూత అందించారు. జాతీయ పోటీలకు ఎంపికైన జీవిత, మోనిష, ధరణిలకు రవాణా ఖర్చుల కోసం రూ.8వేలను పూర్వ విద్యార్థులు ఆర్ముగం, రమేష్, రాజశేఖర్ మిత్రబృందం, భోజన వసతులకు రూ.5వేలను యాదమరి వాణిజ్య దుకాణాల అధ్యక్షుడు కె.రవీంద్ర మొదలియార్ అందజేశారు. దాతలకు హెచ్‌ఎం గిరిరాజ, పీడీలు రవి, హరికృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓరుగంటాలమ్మ ఆలయంలో చోరీ

నగరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సాల్వపట్టెడలో ఓరుగంటాలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్వీపరు శనివారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేయడానికి రాగా, ఆలయం తలుపులు పగులకొట్టి ఉన్నాయి. దీంతో ధర్మకర్తకు సమాచారం ఇచ్చారు. ఆయనొచ్చి పరిశీలించగా.. ప్రధానద్వారం, గర్భగుడి స్టోర్‌రూమ్‌లకు వేసిన తాళాలను, హుండీని పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో పోగైన సొమ్ము రూ.30వేల దాకా ఉంటుందని, భక్తులు సమర్పించిన 8గ్రాముల బంగారు తాళిబొట్టు, వెండి తట్ట చోరీకి గురైనట్లు ఆలయధర్మకర్త తెలిపారు. రాత్రిపూట ఆలయ పరిధిలో ఆకతాయిల సంచారం ఎక్కువైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'విజ్ఞానసుధ'లో 127 మందికి ఉద్యోగాలు



చిత్తూరు సెంట్రల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో 127 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని చైర్మన్ శ్రీధర్ తెలిపారు. తమ కళాశాలలోని డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పది కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో హాస్టల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో సురేష్

చిత్తూరు క్రీడలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ బాలుర హాస్టల్ విద్యార్థులు పతకాలు సాధించారని వార్డెన్ సురేష్ తెలిపారు. జమ్ము కశ్మీర్‌లో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు వంశీకృష్ణ (10వ తరగతి) బంగారు పతకం, ప్రకాష్ (9వ తరగతి) కాంస్య పతకం సాధించారని చెప్పారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు ప్రణవ్ గోవర్ధన్ ఎంపిక



చిత్తూరు క్రీడలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్న ప్రణవ్ గోవర్ధన్ స్కూల్ గేమ్స్ తరఫున రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు డీఎస్‌డీవో బాలాజి తెలిపారు. డిసెంబరు 30, 31 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీల్లో బ్యాటింగ్, వికెట్ కీపర్‌గా ప్రతిభ చూపి, రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడన్నారు. త్వరలో బిహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోవర్ధన్‌ను ఖోఖో సంఘ కార్యదర్శి శరత్ తదితరులు అభినందించారు.

'సింగిల్‌విండో' సర్వేను త్వరగా పూర్తిచేయండి

గంగాధరనెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో సొసైటీకి సంబంధించి మిస్సింగ్ హౌస్‌హోల్డ్ సర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశి సర్వే సిబ్బందిని ఆదేశించారు. గంగాధరనెల్లూరులో దిగవూరు ప్రాంతంలో ఇంటింటి వద్ద అధికారులు నిర్వహిస్తున్న సర్వేకార్యక్రమాన్ని శనివారం సాయంత్రం తనిఖీచేశారు. ఆయన వెంట ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, దుర్గాప్రసాద్, కిరణ్‌కుమార్, కుమార్, మహిళా పోలీస్ నిర్మల, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లిల్లీ తదితరులున్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడటమే చంద్రబాబు ధ్యేయం: మురళీమోహన్



మహిళలతో కలిసి కింద కూర్చొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడటమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శనివారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 94 సంఘాలకు రూ.15.70కోట్లను చెక్‌రూపంలో అందజేశారు. అలాగే స్త్రీనిధి పథకం కింద మంజూరైన లక్షలాది రూపాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, టీడీపీ అధికార ప్రతినిధి గంగారపు గోపి, జడ్పీటీసీదేవిక, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్, జనసేన నేత మనోహర్, ఏపీఎం సింగన్న, అధికారులు, నాయకులు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వెలుగు కార్యాలయానికి వెళ్లి మహిళలతోపాటు కింద కూర్చొని సంక్షేమ పథకాలపై ఆరాతీశారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం: జగన్మోహన్



తాత్కాలిక పండ్ల దుకాణాన్ని మేయర్ అముదతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం పీసీఆర్ కళాశాల రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన నూతన ఎక్స్‌కవేటర్, మూడు ట్యాంకర్లను మేయర్ అముదతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాతబస్టాండు అభివృద్ధిలో భాగంగా పీసీఆర్ రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఫ్రూట్‌స్టాల్స్ షెడ్డును కూడా ప్రారంభించారు. పాత బస్టాండ్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తామని, ఇందు కోసం ఇప్పటికే పురపాలక శాఖ మంత్రితో మాట్లాడానని ఎమ్మెల్యే చెప్పారు. కైలాసపురం శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి హాని కల్గిస్తే కఠిన చర్యలు

గంగాధరనెల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి హానికల్గిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లె దళితవాడకు సమీపంలో కుషాల్ గ్రానైట్ ఫ్యాక్టరీ ఆవరణంలో బయట ప్రాంతం నుంచి ఆయిల్ వేస్ట్‌ను లారీలో తీసుకొచ్చి డంప్‌చేసి ఎండకు ఆరబెట్టారు. దాన్నుంచి వచ్చే దుర్గంధంతో స్థానిక దళితవాడ ప్రజలకు ఇబ్బంది కల్గుతోందని ఎంపీడీవోకి ఫిర్యాదుచేశారు. దీంతో ఆయన శనివారం ఆయిల్‌వేస్ట్‌ను పరిశీలించారు. వెంటనే తొలగించాలని ఫ్యాక్టరీ నిర్వాహకులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యాలకు ప్రభుత్వం పెద్దపీట

కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జగన్మోహన్



బీఎస్ఆర్‌పేట కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్/చిత్తూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ప్రభుత్వ బడులు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల సౌకర్యాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన చెప్పారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డీవీఈవో సయ్యద్ మౌల, పీసీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, టీడీపీ నేతలు వైవీ రాజేశ్వరి, చంద్రప్రకాష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. ● చిత్తూరు రూరల్ మండలంలోని బీఎస్ఆర్ పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మంత్రి లోకేష్ ఆలోచనా ఫలితమే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకమని చెప్పారు. కళాశాల నిర్మాణానికి ఇదే గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ తన స్థలాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, దేవరాజులు నాయుడు, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకమైనది: ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ చాలా కీలకమైనదని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, టీడీపీ నేత గుంటూరు మురళి, నేతాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ రోజులు గుర్తుకొస్తున్నాయ్: ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. నేను ఇక్కడే చదువుకున్నా' అని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏపీఎం కవిత, ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవోలు విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్, కార్వేటినగరం టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, తెలుగు యువత మండల ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి, ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి చెంగల్రాయులు, రాష్ట్ర మాల కార్పొరేషన్ మెంబరు యుగంధర్, నాయకులు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని థామస్ ప్రారంభించారు. తహసీల్దార్ రమేష్‌బాబు, పెనుమూరు టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, సాతాల గుణశేఖర్, పోటుగారి గంగయ్య, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే మాపై దాడులు \ తడుకు, తడుకుపేట గ్రామస్తులు

నగరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారం అమాయకులకు మద్యం పోయించి దాడులు చేయించి.. చివరకు వారిని బలిపశువులను చేశారని నగరి మండలం తడుకు, తడుకుపేట గ్రామస్తులు వాపోయారు. ఇటీవల జరిగిన దాడులవిషయమై శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ కులాలతో నిమిత్తం లేకుండా సోదరసమానులుగా వుండేవారమని గుర్తు చేసుకున్నారు. తడుకు దళితవాడకు చెందిన గాంధీ, సత్య అనుచరులతో కలిసి బీరు బాటిళ్లు, మారణాయుధాలతో కాపుకాసి టీడీపీ కార్యదర్శి పురుషోత్తం నాయుడిపై దాడి చేశారని పేర్కొన్నారు. పురుషోత్తం నాయుడిని కొడుతున్నారని తెలిసి రాజేష్, బాలాజీ సంఘటనా స్థలానికి రాగా వారిపై సైతం దాడి చేశారని వంశీరాజ్ పేర్కొన్నారు. దళితవాడకు తమ వర్గీయులు వెళ్లలేదని రాత్రి ఏడు గంటల సమయంలో సచివాలయం తెరిచి అందులో 30మంది వుండాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. తడుకు మహిళ రాధ మాట్లాడుతూ దళితులతో తామెప్పుడూ సోదరభావంతో మెలిగామే తప్ప ఇంకోరకంగా ప్రవర్తించలేదన్నారు. ఎన్నికలు జరిగినప్పటినుంచీ నానా రకాలుగా వేధిస్తున్నా సర్దుకుపోతున్నామని తెలిపారు.

దళితులకు రక్షణ కల్పించాలి:సీపీఎం

తడుకుపేటలో దళిత మహిళలకు,పిల్లలకు రక్షణ కల్పించాలని నగరి సీఐ మహేశ్వర్‌ను సీపీఐ కార్యదర్శి గంగరాజు కోరారు. సీఐ మాట్లాడుతూ.. తడుకుపేటలో ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేశామన్నారు. ఎవరూ ఆవేశాలకు లోనుకావద్దని, ప్రశాంతతకు భంగం కల్గించరాదని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: డీహెచ్‌పీఎస్

చిత్తూరు రూరల్: తడుకుపేట దళితులపై దాడి దారుణమని డీహెచ్‌పీఎస్ నేతలు నాగరాజు, దామోదరం, మహేష్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరులో వారు మాట్లాడుతూ ఈ సంఘటనపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.